స్టాలిన్ కటీఫ్.. రేవంత్ కార్పెట్

మొదటిపేజీ తరువాయి...

విరుద్ధంగా అదానీతో చేసుకున్న ఒప్పందాలను కొనసాగిస్తున్నది. స్మార్ట్‌మీటర్ల పేరిట విద్యుత్తు రంగంలో విస్తరించాలనుకొంటున్న అదానీ గ్రూప్‌నకు తమిళనాడు సర్కారు కరెంట్ షాక్ ఇచ్చింది. 2023 ఆగస్టులో అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్)తో చేసుకొన్న 'స్మార్ట్ మీటర్ల' ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు 2024 డిసెంబర్ 27న టెండర్లను రద్దు చేసినట్టు తమిళనాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (టీఏఎన్‌జీఈడీసీవో) తెలిపింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన స్మార్ట్‌మీటర్ల ప్రాజెక్టులో భాగంగా తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా 82 లక్షల స్మార్ట్ మీటర్లను బిగించాలని స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో స్మార్ట్‌మీటర్ల కోసం 2023 ఆగస్టులో బిడ్డింగ్ నిర్వహించారు. ఈ బిడ్డింగ్‌లో అదానీ గ్రూప్‌నకు చెందిన ఏఈఎస్ఎల్ కంపెనీ మిగతా కంపెనీల కంటే తక్కువ ధరను కోట్ చేసింది. దీంతో చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు సహా మొత్తం 8 జిల్లాల్లో స్మార్ట్‌మీటర్ల సరఫరా, బిగింపు, రీడింగ్, బిల్లుల వసూలుకు సంబంధించిన నాలుగు కాంట్రాక్ట్‌లను అదానీ కంపెనీకి అక్కడి ప్రభుత్వం అప్పగించింది. అయితే, స్మార్ట్‌మీటర్ల కాంట్రాక్ట్ దక్కించుకొన్న ఏఈఎస్ఎల్ కంపెనీ ఇంతకుముందు మహారాష్ట్ర, బీహార్‌లోనూ ఈ కాంట్రాక్ట్‌లను దక్కించుకొన్నది. దీంతో ఒక్కో స్మార్ట్‌మీటర్‌కు అక్కడ కంపెనీ ఎంత కోట్ చేసిందన్న విషయంపై టీఏఎన్‌జీఈడీసీవో అధికారులు ఆరా తీశారు. ఒక్కో స్మార్ట్‌మీటర్‌కు బయటి రాష్ట్రాల కంటే తమ దగ్గర రూ.120 చొప్పున అదానీ కంపెనీ ఎక్కువ వసూలు చేస్తున్నదని అధికారికవర్గాలు గుర్తించాయి. ఆ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాయి. నివేదికలను పరిశీలించిన ప్రభుత్వం.. అదానీ గ్రూప్‌నకు ఇచ్చిన మొత్తం నాలుగు స్మార్ట్‌మీటర్ కాంట్రాక్టులను తాజాగా రద్దు చేసింది. ఈ కాంట్రాక్టులకు సంబంధించి కొత్త టెండర్లను త్వరలోనే పిలుస్తామని టీఏఎన్‌జీఈడీసీవో అధికారులు తెలిపారు.



తెలంగాణలో చెట్టాపట్టాల్

ఇండియా కూటమిలో ఒక భాగస్వామ్యపక్షంగా ఉన్న డీఎంకే.. పొత్తు ధర్మంలో భాగంగా కూటమి పాలసీకి కట్టుబడి అదానీతో తెగదెంపులు చేసుకున్నది. అయితే, కూటమికి సారథ్యం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం రేవంత్ ప్రభుత్వం వైఖరి అదానీకి అనుకూలంగా ఉండటం విస్మయం కలిగిస్తున్నది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అదానీతో రేవంత్ బంధం బలపడుతున్నట్టు జరుగుతున్న పరిణామాలు, పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో విద్యుత్తు, సిమెంట్, డాటా సెంటర్లు తదితర రంగాల్లో రూ.12,400 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు గత జనవరిలో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో ప్రభుత్వం, అదానీ గ్రూప్ మధ్య ఒప్పందం జరిగింది. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, సీఎం రేవంత్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. డాటా సెంటర్ ఏర్పాటుకు రూ.5 వేల కోట్లు, గ్రీన్ ఎనర్జీకి సంబంధించిన రెండు పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు (పీఎస్‌పీ)ల ఏర్పాటుకు రూ.5 వేల కోట్లు, రక్షణ రంగంలో ఆర్ అండ్‌డీ ఎకోసిస్టం ఏర్పాటుకు రూ.వెయ్యి కోట్లు, సిమెంట్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.1,400 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్టు కంపెనీ తెలిపింది. ఇప్పటికే అదానీకి చెందిన అంబుజా సిమెంట్ రామన్నపేటలో సిమెంట్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నది. సిమెంట్ పరిశ్రమ వద్దంటూ స్థానికులు ఎన్ని నిరసనలు చేపట్టినా రేవంత్ సర్కారు మాత్రం ఏకపక్షంగానే ముందుకు వెళ్తున్నది. మరోవైపు, రాష్ట్రంలో విద్యుత్తు పంపిణీ వ్యవస్థను ఇప్పటికే అదానీకి అప్పగించినట్టు వార్తలొస్తున్నాయి. ఆ గ్రూప్‌నకు చెందిన సిబ్బంది ఇటీవల పాతబస్తీలో కరెంట్ మీటర్ల వివరాలను సేకరించడాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇక, రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూపు రూ.100 కోట్లు విరాళం ఇవ్వడం.. దీనిపై సర్వత్రా విమర్శలు రావడంతో రేవంత్ ప్రభుత్వం ఆ విరాళాన్ని ఇష్టంలేకపోయినా వెనక్కి ఇస్తున్నట్టు ప్రకటించడం తెలిసిందే.

సంకీర్ణ ధర్మానికి కట్టుబడి..

దేశంలో సౌర విద్యుదుత్పత్తి సరఫరా ఒప్పందాలు చేసుకునేందుకు ఏపీ, ఒడిశా, తమిళనాడు, జమ్ముకశ్మీర్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ఉన్నతాధికారులకు అదానీ గ్రూప్ ప్రతినిధులు రూ.2,029 కోట్లు ముడుపులు ఇచ్చారంటూ అమెరికాలోని ఈస్ట్ డిస్ట్రిక్ట్ న్యూయార్క్ కోర్టులో గత నవంబర్‌లో అభియోగాలు నమోదయ్యాయి. దీనిపై అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీపై అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయ్యింది. అలాగే, అదానీ గ్రూప్ కంపెనీల్లో అవకవతకలు జరిగాయంటూ అమెరికా షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ కూడా గతంలో ఆరోపించింది. ఈ నేపథ్యంలో అదానీ అక్రమాలపై చర్చించాలని పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు కేంద్రాన్ని పట్టుబట్టారు. కూటమిలోని ప్రధాన పార్టీ కాంగ్రెస్ నేతలు అదానీ చర్యలను ఎండగట్టారు. తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే.. ఇండియా కూటమిలోనే భాగస్వామిగా ఉన్నది. అదానీతో చేసుకొన్న 'స్మార్ట్ మీటర్ల' డీల్‌ను అప్పటికే స్టాలిన్ సర్కారు సమీక్షిస్తున్నది. ఈ క్రమంలో 'స్మార్ట్ మీటర్ల' కాంట్రాక్ట్‌లో అధిక ధరల వ్యవహారం బయటపడింది. దీంతో సంకీర్ణ ధర్మానికి కట్టుబడిన స్టాలిన్ సర్కారు.. అదానీతో డీల్‌ను వెంటనే రద్దు చేసుకొని తన నిబద్ధతను చాటుకున్నది.

లోకం పోకడ

సార్ మనం డబుల్ సక్సెస్.. మద్యం అమ్మకంలో, జరిమానా వసూళ్లలోనూ ఆదాయం!

అడవుల్లో పెరిగిన అగ్నిప్రమాదాలు

మూడో స్థానంలో తెలంగాణ రాష్ట్రం

హైదరాబాద్, జనవరి 1 (నమస్తేతెలంగాణ): దేశంలోని అటవీ ప్రాంతాల్లో 2023-24 ఏడాదిలో అగ్నిప్రమాదాల సంఖ్య పెరిగింది. ఈ ప్రమాదాల పరంగా తెలంగాణ రాష్ట్రం మూడోస్థానంలో నిలవగా, తొలి, రెండో స్థానాల్లో ఏపీ, మహారాష్ట్ర ఉన్నాయి. 2023 నవంబర్ - 2024 జూన్ సీజన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 5,286.76 చ.కి.మీ. విస్తీర్ణంలో అగ్నిప్రమాదాల్లో అటవీ భూమి కాలిపోగా, మహారాష్ట్రలో మొత్తం కాలిపోయిన అటవీ ప్రాంతం 4,095.04 చదరపు కి.మీ.గా నమోదైంది. ఆ తర్వాత తెలంగాణలో 3,983.28 చదరపు కిలోమీటర్లుగా నమోదైంది. ఇండియన్ స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ సంస్థ తాజాగా విడుదల చేసిన 2023-24 సీజన్ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దేశంలోని 52 టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతాల్లో అత్యధికంగా అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు ప్రాంతాలు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. తెలంగాణ అడవుల్లో అగ్నిప్రమాదాల సంఖ్య పెరిగింది.

మల్లోజుల వేణు భార్య లొంగుబాటు

- తారక్కతో సహా 11 మంది మావోయిస్టులు లొంగుబాటు
- 38 ఏండ్లలో 35 ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్న తారక్క
- 170 కేసులు, రూ.కోటికిపైగా రివార్డు

ముంబై/పెద్దపల్లి, జనవరి 1 (నమస్తే తెలంగాణ)/గడ్చిరోలి: మావోయిస్టు పార్టీలో మరో సంచలనాత్మక లొంగుబాటు నమోదైంది. మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాలరావు భార్య తారక్క లొంగిపోయారు. ఆమెతోపాటు మరో పది మంది మావోయిస్టులు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో బుధవారం గడ్చిరోలిలో లొంగిపోవడం సంచలనం సృష్టించింది. వీరిలో ఎనిమిది మంది మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాకు చెందిన సిడాం విమలచంద్ర అలియాస్ తారక్క అలియాస్ వత్సల 1986 నుంచి నక్సల్స్ ఉద్యమంలో పనిచేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చెందిన ఆమె భర్త మల్లోజుల వేణు మావోయిస్టు పార్టీలో అగ్రనేతగా వ్యవహరిస్తున్నారు. దాదాపు 38 ఏండ్లుగా విప్లవ సంస్థల్లో పనిచేస్తున్న తారక్క 35 ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించుకున్నట్టు సమాచారం.

గడ్చిరోలిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో లొంగిపోతున్న మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాలరావు భార్య తారక్క.

కీలక బాధ్యతల్లో తారక్క

గడ్చిరోలి జిల్లా అహేరి మెంబర్‌గా, పెరిమిలి, భామ్రఘడ్ ఏరియా కమాండర్‌గా, ఏరియా కమిటీ సెక్రటరీగా, సౌత్ గడ్చిరోలి డివిజన్ కమిటీ సభ్యురాలిగా పనిచేసిన తారక్క ఇటీవల దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా బాధ్యతలు చేపట్టారు. దండకారణ్య వైద్య బృందానికి కూడా నాయకత్వం వహిస్తున్నారు. ఆమెపై వివిధ పోలీస్‌స్టేషన్లలో దాదాపు 170 కేసులు, రూ.కోటికి పైగా రివార్డు ఉన్నట్టు మహారాష్ట్ర పోలీసులు వెల్లడించారు. ఆమె గడ్చిరోలి రీజియన్‌లో మోస్ట్ వాంటెడ్ నక్సల్స్ లిస్టులో ఉండటం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పునరావాస విధానాల్లో భాగంగా లొంగిపోయిన తారక్క రూ.15 లక్షలు, మిగిలిన వారు వారి తలలపై ఉన్న రివార్డుల మొత్తాన్ని బట్టి సహాయాన్ని అందుకుంటారు. నక్సల్స్ కార్యకలాపాలపై 2022 నుంచి ప్రభుత్వం కఠిన చర్యలు అవలంబిస్తుండటంతో ఇప్పటివరకు 44 మంది కరడుగట్టిన మావోయిస్టులు లొంగిపోయినట్టు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ మాట్లాడుతూ.. నక్సలిజం ముగింపు దశకు చేరుకున్నదని పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థల ద్వారానే న్యాయం జరుగుతుందని మావోయిస్టులు భావిస్తున్నారని అభిప్రాయపడ్డారు. నెల క్రితం దండకారణ్యంలో పనిచేస్తున్న మరో ముఖ్యనేత పోలీసుల అదుపులో ఉన్నట్టుగా ప్రచారం జరిగింది. వేణుగోపాలరావు సోదరుడు కిషన్‌జీ భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని కూడా వదంతులు వినిపించాయి. అయితే, ఇదంతా పోలీసుల ప్రచారమేనని మావోయిస్టు పార్టీ కొట్టిపారేసింది. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరింది. ఈ నేపథ్యంలో తాజాగా అత్యంత కీలక బాధ్యతల్లో ఉన్న వేణుగోపాలరావు భార్య లొంగిపోవడం సంచలనంగా మారింది.

దళిత యువకుడిపై పోలీసు దాష్టీకం

మొదటిపేజీ తరువాయి...

తాగుతున్నాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో పెట్రోలింగ్‌లో భాగంగా అటువైపు వచ్చిన ఇద్దరు కానిస్టేబుళ్లు వాళ్లను అక్కడి నుంచి వెళ్లిపోమ్మని చెప్పారు. రాము మినహా మిగతా వాళ్లు వెళ్లిపోయారు. 'ఈ ఇల్లు మాదే.. మేము ఎవరికీ ఇబ్బంది కలిగించడం లేదు' అని రాము పోలీసులతో అన్నాడు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగింది. కానిస్టేబుళ్లు ఫోన్‌లో ఎస్సైకి సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి వచ్చి కనీస విచారణ చేపట్టకుండానే తనను బలవంతంగా పోలీస్ వాహనంలో స్టేషన్‌కు తీసుకెళ్లి 15 నిమిషాలపాటు విచక్షణారహితంగా కొట్టినట్టు రాము వాపోయాడు. రాత్రంతా పోలీస్ స్టేషన్‌లోనే ఉంచి కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదని పేర్కొన్నాడు. ఎస్సై కొట్టిన దెబ్బలకు ఒళ్లంతా కమిలిందని మీడియా ఎదుట వాపోయాడు. ఈ విషయమై ఎస్సై మహేందర్‌నాథ్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. పెట్రోలింగ్‌కు వెళ్లిన ఇద్దరు కానిస్టేబుళ్లపై కాటూరి రాము చెయ్యి చేసుకున్నట్టు తెలిపారు. వాళ్లు తనకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో తాను అక్కడికి వెళ్లగా తన పట్ల కూడా దురుసుగా వ్యవహరించడంతో స్టేషన్‌కు తీసుకొచ్చినట్టు చెప్పారు. ఈ క్రమంలోనే మందలించినట్టు తెలిపారు.

గుండెపోటుతో రైతు మృతి

బైపాస్ రోడ్డులో భూమి పోతుందనే బెంగ

వరంగల్ నగరంలో దారుణం

కాశీబుగ్గ, జనవరి 1: కొత్తగా నిర్మించే బైపాస్ రోడ్డులో భూమి పోతుందనే ఆందోళనతో గుండెపోటు రాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు ఓ రైతు. ఈ ఘటన వరంగల్ నగరంలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ప్రతిపాదించిన ఇన్నర్ రింగ్ రోడ్డు కింద రైతుల వ్యవసాయ భూములు పోతున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్‌లోని 3వ డివిజన్ ఆరేపల్లికి చెందిన రైతు దయ్యాల రాజ బీరయ్య(73)కు చెందిన ఎకరం ఇరవై గుంటల భూమి ఐఆర్‌ఆర్ కిందపోతున్నది. తన కుటుంబానికి జీవనాధారమైన పంట భూమి పోతుందని బీరయ్య ఆందోళనకు గురయ్యాడు. ఇటీవల గుండెనొప్పి రాగా హనుమకొండలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా ఆపరేషన్ చేశారు. అయినప్పటికీ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు.

రాష్ట్రంలో విచ్చలవిడిగా నకిలీ ఔషధాలు

2023తో పోల్చితే నిరుడు రెట్టింపు

జ్వరం నుంచి క్యాన్సర్ వరకు అన్నీ నకిలీలే

ఉనికిలో లేని కంపెనీల పేరుతో తయారు

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నకిలీ ఔషధాల తయారీ, సరఫరా విచ్చలవిడిగా జరుగుతున్నది. నిరుటితో పోల్చితే నకిలీ ఔషధాలు రెట్టింపైనట్టు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) తాజాగా విడుదల చేసిన నివేదిక స్పష్టం చేస్తున్నది. సాధారణ జ్వరానికి వాడే పారాసిటమాల్ మొదలుకొని క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే మందుల వరకు నకిలీలు పట్టుబడుతున్నట్టు వెల్లడించింది. 2023లో పరీక్షించిన 4,553 నమూనాల్లో 79 (1.73 శాతం), నిరుడు పరీక్షించిన 3,902 శాంపిళ్లలో 130 (3.33 శాతం) నకిలీవని తేల్చింది.

ఏడేండ్లలో ఇప్పుడే అత్యధికం

ఏడాది	శాంపిళ్లు	నకిలీవి	శాతం
2018	2,571	38	1.47
2019	2,579	38	1.47
2020	2,531	7	0.27
2021	2,524	12	0.47
2022	2,780	15	0.53
2023	4,553	79	1.73
2024	3,902	130	3.33

సర్వం నకిలీ మయం

2024లో పట్టుబడిన నకిలీ ఔషధాలను పరిశీలిస్తే.. అక్రమార్కులు అన్ని రకాల మందులను కల్తీ చేస్తున్నట్టు స్పష్టమవుతున్నది. కొందరు ఉనికిలో లేని కంపెనీల పేర్లతో, మరికొందరు పేరున్న కంపెనీల పేరుతో నకిలీ ఔషధాలను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. మరికొందరు ఇతర రాష్ట్రాల్లో తయారైన నకిలీ ఔషధాలను తెలంగాణలోకి తీసుకొచ్చి అమ్ముతున్నట్టు తేలింది. హైదరాబాద్‌లోని మచ్చబొల్లారంలో డీసీఏ జరిపిన దాడుల్లో 'ఆస్ట్రా జెనరిక్స్' అనే కంపెనీ పేరుతో నకిలీ ఔషధాలు తయారు చేస్తున్నట్టు తేలింది. అసలు ఈ కంపెనీ మనుగడలోనే లేదని అధికారులు గుర్తించారు. వీళ్లు క్యాన్సర్ చికిత్సలో వాడే ఔషధాలకు నకిలీ తయారుచేసి అమ్ముతున్నట్టు నిర్ధారించారు. జూలైలో దూలపల్లిలో నిర్వహించిన దాడుల్లో 'అబాట్' సంస్థ పేరుతో నకిలీ ఔషధాలు తయారు చేస్తున్నట్టు గుర్తించారు. ఇందులో పారసిటమాల్ గోలీలు కూడా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా కరకపట్లలోని బయోటెక్ పార్క్‌లో ఇతర కంపెనీల పేరిట యాంటీ బయాటిక్స్ తయారు చేసి, విదేశాలకు ఎగుమతి చేస్తున్న ముఠా గుట్టును అధికారులు రట్టు చేసి, దాదాపు రూ.కోటిన్నర విలువైన మందులు సీజ్ చేశారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో విచ్చలవిడిగా నకిలీ మందులు తయారవుతున్నాయని, గతేడాది మొత్తంగా రూ.11.32 కోట్ల విలువైన నకిలీ ఔషధాలను సీజ్ చేశామని డీసీఏ వెల్లడించింది. కొందరు మెడికల్ షాపుల యజమానులు, ఆర్‌ఎంపీలు, డాక్టర్లు కాసుల కక్కుర్తితో రోగులకు నకిలీ ఔషధాలను అమ్ముతున్నట్టు డీసీఏ తనిఖీల్లో తేలింది. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, మందుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. నకిలీ ఔషధాలను గుర్తిస్తే 18005996969 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

నార్త్‌సిటీకి మెట్రో రైలు

మొదటిపేజీ తరువాయి...

విస్తరణలో భాగంగా మొత్తంగా 162 కిలోమీటర్ల మేర మెట్రో రైలు అందుబాటులోకి రానున్నది. ఇప్పటికే ఫేజ్-2 పార్ట్-ఏలో 76 కిలోమీటర్ల మెట్రో నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ సిద్ధం కాగా, పార్ట్-బీలో భాగంగా ఫోర్త్ సిటీ, ప్యారడైజ్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట ప్రాంతాలను కలుపుతూ డీపీఆర్‌ను సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం కిలోమీటర్‌కు రూ.318 కోట్లు ఖర్చు అవుతుండగా... తాజా ప్రతిపాదనల నేపథ్యంలో అంచనా వ్యయం మరో రూ.14 వేల కోట్లు దాటే అవకాశం ఉన్నది. ఈ ప్రాజెక్టును కూడా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి నిర్మించనున్నారు. మొత్తానికి నార్త్‌సిటీలో ముఖ్యమైన మేడ్చల్, శామీర్‌పేట వరకు మెట్రోరైలు మార్గం నిర్మించనుండటంతో ఆ ప్రాంతంలో నిత్యం ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలు తొలగిపోనున్నాయి. ప్రధాన ఐటీ కేంద్రమైన వెస్ట్ హైదరాబాద్ తరహాలో నార్త్‌సిటీని అభివృద్ధి చేసేలా బీఆర్ఎస్ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ కేంద్రంగా ఐటీపార్క్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించింది. అటు జేబీఎస్ నుంచి జీనోమ్‌వ్యాలీ వరకు, ఇటు ప్యారడైజ్ నుంచి డైరీఫాం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని కేసీఆర్ హయాంలోనే ప్రతిపాదించింది. ఇందుకు అవసరమైన భూములను రక్షణ శాఖ నుంచి తీసుకునేందుకు అప్పట్లోనే చొరవ చూపిన విషయం తెలిసిందే.

మూడు నెలల్లో డీపీఆర్ సిద్ధం చేస్తాం

ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా నార్త్ సిటీ మెట్రో రైలు నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో ఆ ప్రాంత ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయి. ఫేజ్-2 పార్ట్-బీ కింద డీపీఆర్‌ను మూడు నెలల్లో సిద్ధం చేస్తాం. రెండు మార్గాల్లో 45 కిలోమీటర్ల మేర మెట్రో ప్రాజెక్టును కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా రూపొందించేలా ప్రణాళికలు ఉండాలని, ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ అనుమతికి పంపించాలని సీఎం సూచించారు. నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా మెట్రో రైలును విస్తరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తాం. - ఎన్వీఎస్ రెడ్డి, హెచ్ఏఎంఎల్ ఎండీ

డీపీఆర్‌తో వదిలిపెట్టొద్దు

నార్త్‌సిటీ మెట్రో ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం అభినందనీయం. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా మెట్రో నిర్మించాలని ఏడాది కాలంగా ఉద్యమించాం. ఇంటింటికీ మెట్రో సాధన డిమాండ్‌ను తీసుకెళ్లేలా, నార్త్‌సిటీలో ఉన్న 30 లక్షల మంది చిరకాల కోరికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా కార్యక్రమాలు నిర్వహించాం. స్థానిక నేతల నుంచి ప్రధాని మోదీ వరకు నార్త్‌సిటీ మెట్రో సాధన ప్రాధాన్యాన్ని వివరిస్తూ లేఖలు అందజేశాం. రాష్ట్ర ప్రభుత్వం నార్త్‌సిటీ మెట్రోనూ ఫేజ్-2 లోనే నిర్మించాలని నిర్ణయించడంతో ఆధునాతన రవాణా సౌకర్యం ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి రానున్నది. కేవలం డీపీఆర్ రూపొందించి విడిచి పెట్టకుండా, యుద్ధప్రాతిపదికన ఫేజ్-2 మొత్తం పనులు చేపట్టేలా చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరుతున్నాం. ఈ ప్రజా ఉద్యమంలో సహకరించిన వివిధ రాజకీయ పార్టీల నేతలు, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ప్రజాసంఘాలు, కమ్యూనిటీ సొసైటీలు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు.

- మేడ్చల్ మెట్రో సాధన సమితి

మెట్రో ఫేజ్-2 పార్ట్-ఏ వివరాలు

ఎక్కడి నుంచి ఎక్కడకు	దూరం (కి.మీ.)
కారిడార్-4(నాగోల్-శంషాబాద్)	36.8
కారిడార్-5(రాయదుర్గం-కోకాపేట)	11.6
కారిడార్-6(ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట)	7.5
కారిడార్-7(మియాపూర్-పటాన్‌చెరు)	13.4
కారిడార్-8 (ఎల్బీనగర్ - హయత్‌నగర్)	7.1
పార్ట్ బీ	
కారిడార్-9 (శంషాబాద్-ఫోర్త్‌సిటీ)	40
కారిడార్-10 (జేబీఎస్ - శామీర్‌పేట)(ప్రతిపాదన)	22
కారిడార్-11(ప్యారడైజ్- మేడ్చల్)(ప్రతిపాదన)	22

నార్త్‌సిటీ ప్రజల కల సాకారం

నార్త్‌సిటీ మెట్రో రైలు ప్రాజెక్టుకు ప్రభుత్వం లైన్ క్లియర్ చేయడంతో ప్రజల చిరకాల కల సాకారమైంది. ఏడాది కాలంగా తమ ప్రాంతానికి మెట్రో రైలు నిర్మించాలంటూ సాగిన ప్రజా పోరాటానికి సీఎం స్పందించారు. నార్త్‌సిటీకి మెట్రో నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనూ ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లాం. కేసీఆర్ హయాంలో నార్త్‌సిటీకి మెట్రో నిర్మించాలనే ప్రతిపాదనలను రేవంత్‌రెడ్డి పరిగణనలోకి తీసుకుని నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

-మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే

గేటెడ్ కమ్యూనిటీల నిర్వహణకు మార్గదర్శకాలు రూపొందించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అక్రమ కార్యకలాపాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని పోలీసులకు స్పష్టీకరణ

ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్ విల్లా కమ్యూనిటీలో సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశం

హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): గేటెడ్ కమ్యూనిటీల నిర్వహణకు మార్గదర్శకాలను రూపొందించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రస్తుతం రాష్ట్రంలో తెలంగాణ అపార్ట్‌మెంట్స్ యాక్ట్ కింద గేటెడ్ కమ్యూనిటీలను నిర్వహిస్తున్నప్పటికీ వాటిలో అక్రమ కార్యకలాపాల నియంత్రణకు వీలుకావడం లేదని పేర్కొన్నది. గేటెడ్ కమ్యూనిటీల్లో అసాంఘిక, చట్టవిరుద్ధమైన కార్యకలాపాల నియంత్రణకు చర్యలు చేపట్టే అధికారం పోలీసులకు ఉన్నదని తేల్చిచెప్పింది. హైదరాబాద్ కేపీహెచ్‌బీలోని ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్ విల్లాల కమ్యూనిటీలో అక్రమంగా పేకాట, మద్యపానం, మత్తు పదార్థాల వినియోగం, లైంగిక కార్యకలాపాలు జరుగుతుండటంపై ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ఇటీవల విచారణ జరిపారు. ఆ గేటెడ్ కమ్యూనిటీలో ముగ్గురు సభ్యులతో ఓ సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని, అందులో సీనియర్ సిటిజన్లు, మహిళలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చోటు కల్పించాలని ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్‌ను ఆదేశించారు. గేటెడ్ కమ్యూనిటీల్లో అక్రమ కార్యకలాపాల నియంత్రణకు ఏమేమి చేయాలో, ఏమేమి చేయకూడదో స్పష్టంచేస్తూ తగిన సలహాలు, సూచనలతో ఫ్లాట్ ఓనర్ల అసోసియేషన్లకు మార్గదర్శకాలను జారీ చేయాలని పోలీసు కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. గేటెడ్ కమ్యూనిటీల్లో నేరాలు, న్యూసెన్స్ కేసులపై ఏవైనా ఫిర్యాదులు